

పెన్‌పహాడ్ : చీదెళ్లలో గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# సీఎం కేసీఆర్ పాలనలో అన్నీ సంచలనాలే

- తొమ్మిదేండ్లుగా జోరుగా అభివృద్ధి, సంక్షేమం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో 1000 పడకల ప్రభుత్వ దవాఖాన భవనానికి శంకుస్థాపన

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 5 : ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో అన్ని రంగాల అభివృద్ధితో పాటు మెరుగైన ప్రభుత్వ వైద్యం, వైద్య విద్య మరింత చేరువయ్యాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన వెయ్యి పడకల ప్రభుత్వ సర్వజన వైద్యశాల (టీచింగ్ ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి) భవనానికి గురువారం మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. పోరాడి సాధించిన తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడం కోసం నూతన జిల్లాలను ఏర్పాటు చేయడమే కాకుండా జిల్లాకో మెడికల్ కళాశాల ప్రసాదించడంతో అన్ని రంగాల అభివృద్ధితో పాటు వైద్య ఆరోగ్య సేవల్లోనూ యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా కేంద్రంగా ప్రకటించబడి మెడికల్ కళాశాల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు వైద్య విద్య మరింత చేరువైందన్నారు. దేశానికి మరో 150 మంది వైద్యులను అందించే అవకాశాన్ని కోల్పోవద్దన్న సంకల్పంతో ప్రకటించిన ఏడాదిలోనే కళాశాల ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, వైద్యేతర సిబ్బంది కృషితో కొవిడ్ కాలంలో వేలాది మంది రోగుల ప్రాణాలు నిలబెట్టగలిగామన్నారు. సూర్యాపేట ఆస్పత్రిలో చుట్టు పక్కల జిల్లాల నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడికి వచ్చి వైద్య సేవలు పొందడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల సౌకర్యాలు జిల్లా జనరల్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అంతేకాకుండా మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలను విస్తరించాలనే లక్ష్యంతో పల్లె, బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. వందల రకాల పరీక్షలను ఉచితంగా అందించాలనే సంకల్పంతో మెడికల్ హబ్‌లను ఏర్పాటు చేయగా ప్రజలంతా సద్వినియోగం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. భవిష్యత్‌లోనూ మరిన్ని సేవలను కొనసాగిస్తూ సూర్యాపేటను చరిత్రలో నిలిచేలా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శారదాదేవి, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ దండ మురళీధర్‌రెడ్డి, వైద్యులు రమేశ్ నాయక్, యశ్వంత్, బైరు వెంకన్న, కౌన్సిలర్ సిరువేళ్ల లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

# పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలి

**చీదెళ్లలో గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి**

పెన్‌పహాడ్ : పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చీదెళ్లలో రూ.9.70 కోట్లతో 10 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే సీడీపీ, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.5.50 లక్షలతో నిర్మించిన ప్రయాణికుల ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో అమలౌతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయం సాధించి పెట్టడం ఖాయమన్నారు. రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం గోదాములు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2014లో బీడుగా ఉన్న పెన్‌పహాడ్ మండలానికి ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం జలాలను తీసుకువచ్చి ఈ ప్రాంతమంతా పచ్చని పొలాలతో సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. ఈ మహోత్తర కార్యక్రమాన్ని సాకారం చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలన్నారు. అంతేకాకుండా గ్రామ పాలనలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలే లేని చోట నూతన భవన నిర్మాణాలు చేపట్టడంతో నేడు ప్రజలకు పరిపాలన సౌకర్యవంతంగా మారిందన్నారు. మండలానికి మారుమూల ప్రాంతమైన చీదెళ్లకు వెళ్లాలంటే రహదారి లేక దుమ్ముదూళితో నానా ఇబ్బందులు ఎదురుకొన్నారని నేడు ఏ గ్రామానికైనా, తండాకైన అంతర్గత, ఆర్‌అండ్‌బీ రహదారులు అద్దంలా మెరుస్తున్నాయన్నారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలో అభివృద్ధికి పట్టం కట్టడానికి పార్టీలకతీతంగా బీఆర్ఎస్‌కు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారామ్‌రెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్ పరెడ్డి సీతారామ్‌రెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుర్రం అమృతారెడ్డి, కీర్తి వెంకట్రావ్, ఇంద్రసేనారావు, వెంకటేశ్వర్లు, ధర్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు సూర్యాపేటలో మహా ప్రస్థానం ప్రారంభం

బొడ్రాయిబజార్, అక్టోబర్ 5 : సూర్యాపేటలోని మహా ప్రస్థానం సేవలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సకల వసతులు, అత్యాధునిక సౌకర్యాలతో రూ 4.20 కోట్లతో అధునీకరించిన మహా ప్రస్థానం సేవలకు సిద్ధంగా ఉన్నది. ఈ మేరకు గురువారం మంత్రి జగదీశ్‌రెడ్డి మహా ప్రస్థానాన్ని పరిశీలించారు. కాటి కాపరులతో సమావేశమై అంత్యక్రియలకు రూ.6 వేలుగా రుసుంను నిర్ణయించారు. అలాగే అద్దె ఇండ్లలో ఉండే వారి ఇంట్లో ఎవరైనా చనిపోతే అతి తక్కువ ఫీజుతో పది మంది కుటుంబ సభ్యులు ఉండేలా రెండు కాటేజీలను సిద్ధం చేశారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహాజన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి ప్రకాశ్, వల్దాస్ జానీ పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

**నల్లగొండ జిల్లాలో 7 సీసీఐ కేంద్రాలు**

- ఈ నెల చివరి వారం నుంచి కొనుగోళ్లు!
- క్వింటాకు మద్దతు ధర రూ.7,020
- విక్రయాలకు బయోమెట్రిక్ తప్పనిసరి
- జిల్లాలో 39.44 లక్షల క్వింటాళ్ల పత్తి ఉత్పత్తి అంచనా

నల్లగొండ, అక్టోబర్ 5 : పత్తి కొనుగోలుకు మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. నల్లగొండ జిల్లాలో జిన్నింగ్ మిల్లులున్న 7 చోట్ల కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ఈ నెల చివరి వారం నుంచి కొనుగోళ్లు జరుపనున్నది. మద్దతు ధర క్వింటాకు రూ.7,020 కాగా, విక్రయాల సమయంలో రైతులకు బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో రైతులు తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 5,66,850 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా.. 39,44,251 ఉత్పత్తి వస్తుందన్నది అంచనా.

జిల్లా వ్యాప్తంగా ఈ వానకాలం సీజన్‌లో పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. దాంతో జిల్లాలో పత్తి కొనుగోళ్ల మార్కెటింగ్ యంత్రాం గం ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే తొలి దఫాలో పంట వేసిన రైతులకు మైల పత్తి వస్తున్న నేపథ్యంలో ఈ నెల చివరి వారంలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు అయ్యేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో ఈ సీజన్‌లో 5, 66, 850 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా 39,44,251 క్వింటాళ్ల పత్తి వస్తున్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బహిరంగ మార్కెట్‌లో ధరను బట్టి సీసీఐ కేంద్రాలకు పత్తి ఏ మేరకు వస్తుందో అనేది తెలుస్తుంది. అయితే ప్రస్తుతం తొలి దశలో వచ్చే పంట పెద్దగా క్వాలిటీ లేకపోవడంతో రైతులు అక్కడక్కడా క్వింటాకి రూ.6,300 నుంచి రూ.6,800 వరకు విక్రయిస్తున్నారు. రెండో దశలో ఏరే పత్తి క్వాలిటీ వస్తే బహిరంగ మార్కెట్‌లో ధరను బట్టి సీసీఐ కేంద్రాల ఉనికి తెలుస్తున్నది. అయితే తక్కువ ధరకు దళారులకు అమ్మి మోస పోవద్దని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

### గతేడాది పది వేల దాక అమ్మిన రైతులు..

జిల్లాలో పండించిన పత్తికి గతేడాది మంచి ధరనే పలికింది. సీసీఐ క్వింటాకు రూ.6,380 ఇవ్వగా బహిరంగ మార్కెట్‌లో క్వాలిటీని బట్టి ధర అంచనాలకు మించి పలికింది. ఆరంభంలో ఆరేడు వేలే పలికిన క్వింటా ధర రెండు, మూడో దశలో ఏరిన పత్తికి కొన్ని ప్రాంతాల్లో రూ. 10 వేల దాక పలికింది. దాంతో ఈ సారి కూడ అంత స్థాయిలో ఉండే అవకాశం ఉన్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. అంతలా పెరిగిన ధర చివరి దశలో మళ్లీ ఆరేడు వేలకు రావడంతో కొందరు రైతులు ఆ దశ పత్తిని ఇంట్లోనే నిల్వ చేసుకోని ఇప్పటికి అమ్మలేదు. ఈ సారి బహిరంగ మార్కెట్‌లో మంచి ధర వస్తే అమ్మడం లేదంటే మద్దతు ధర ఇచ్చే సీసీఐ కేంద్రాలకు తరలించటం జరిగే అవకాశం ఉంది.

### బయోమెట్రిక్ తప్పనిసరి..

పత్తి విక్రయించాలి అనుకునే రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని మార్కెటింగ్ అధికారులు సూచిస్తున్నారు. ప్రతి కేంద్రంలో బయోమెట్రిక్ తప్పని సరి చేశారు. మొదట బయోమెట్రిక్ అయిన తర్వాతనే పత్తి కొనుగోలు చేసి ఆ తర్వాత పాస్ బుక్‌లు, బ్యాంక్ ఖాతాలు తీసుకోనున్నారు.ఈ సీజన్‌లో జిల్లాలో ఈ ఏడాది 5.66 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా 39.44 లక్షల క్వింటాళ్ల పత్తి ఉత్పత్తి కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఇందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో మార్కెటింగ్ శాఖ యంత్రాంగం మానిటరింగ్‌తో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయనుంది. ప్రస్తుతం నల్లగొండతో పాటు మల్లేపల్లి, మాల్, చండూర్, నకిరేకల్, చిట్యాల, శాలిగౌరారం జిన్నింగ్ మిల్లులు ఉండటంతో అక్కడ సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### జిల్లాలో ఏడు కేంద్రాలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం



జిల్లాలో ఈ సీజన్‌లో పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తిని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు ప్రస్తుతం జిన్నింగ్ మిల్లులు ఉన్న ప్రాంతాల్లో ఈ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం క్వింటాకు ప్రభుత్వం రూ.7,020 చెల్లిస్తున్నందున రైతులు అంతకు తక్కువ బహిరంగ మార్కెట్‌లో అమ్మి నష్టపోవద్దు. ఈ నెల చివరి వారంలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. అయితే ప్రతి రైతుకు బయోమెట్రిక్ ఉన్నందున తన ఆదార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలి.

– శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి,నల్లగొండ

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- 6వ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కవిత

సూర్యాపేట, అక్టోబర్ 5 : వసతి గృహాల్లో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉంటూ జాగ్రతలు తీసుకోవాలని 6వ స్థాయీ సంఘం (సాంఘిక సంక్షేమ) చైర్‌పర్సన్ బాణాల కవిత అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన 6వ స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల వసతి గృహాలను అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులను సంరక్షించేలా చర్యలు ఉండాలన్నారు. విద్యార్థులకు వేడివేడి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. దళిత బంధు పథకంలో అర్హులైన దళితులను ఎంపిక చేయడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. దళిత బంధు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈఓ సురేశ్, భిక్షం పాల్గొన్నారు.

## గౌడ సంఘం సూర్యాపేట పట్టణాధ్యక్షుడిగా వెంకన్నగౌడ్



వెంకన్నగౌడ్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 5 : తెలంగాణ గౌడ సంఘం సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా పల్స వెంకన్నగౌడ్ నియమితులయ్యారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కక్కిరేణి నాగయ్యగౌడ్ గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్స వెంకన్నగౌడ్ మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగయ్యగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 5 : మండలంలోని రహీంఖాన్‌పేటలో పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట డీపీఓ సునంద, తాసీల్దార్ ఆండాలు, ఆర్ఐ యాదగిరి, బీఎల్ఓలు ఉన్నారు.



ఏపూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన వన అధికారి శ్రీధర్

## ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

- జిల్లా ఉద్యాన వన అధికారి శ్రీధర్

ఆత్మకూర్.ఎస్, అక్టోబర్ 5 : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన వన, పట్టు శాఖ అధికారి శ్రీధర్ అన్నారు. గురువారం ఏపూరు రైతు వేదికలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించి మాట్లాడారు. మండలంలో పుష్కలంగా నీటి వనరులు, మంచి సారవంతమైన ఎర్ర నేలలు, ఇసుక నేలలు ఉన్నాయి. ఆయిల్ పామ్ పంట ఒకసారి వేసుకుంటే 25 నుంచి 30 సంవత్సరాల పాటు ప్రతి నెల దిగుబడిని తీసుకోవచ్చు. నమ్మకమైన బై బ్యాక్ ఉన్నటువంటి పంట అని తెలిపారు. ఈ పంటకు కోతల సమస్య, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరుగదన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన గొర్రెలు, మేకల పెంపకం, పాడి పరిశ్రమ, నాటుకోళ్ల పెంపకం చేపట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ దివ్య, ఏఈఓ శివమూర్తి, రైతు బంధు సమితి సభ్యులు దామిడి శ్రీనివాస్, కనాల మల్లారెడ్డి, కారింగుల లింగయ్య, దామిడి రాజు, వీరారెడ్డి, రైతులు పాల్గొన్నారు.